# స్వార్థపరుడు

భార్యను కాపరానికివెళ్ళిన కొత్తలో.

"ఏమండీ, ఇవాళ సినిమాకు పోదాం?

"వద్దు!"

"ఏమండీ?"

"ఊరికేనే"

"రేపుపోదాం?"

"ఊఁహూఁ!"

"ఏం? అయితే ఎప్పుడు పోదామండీ?"

"చూతాంలే.... ఎప్పుడో ఒకప్పుడు.... వచ్చే ఆదివారం!"

వచ్చే ఆదివారం నాడు.

"ఓయ్! ఇదంతా ఏమిటి? ఇంత షోకు చేసుకున్నావు?"

మనం సినిమాకు పోవటం లేదుటండీ?"

"ఆ అలంకారం తోనే!"

"అలంకారం అయితే ఏం?"

"నువ్విట్లా వస్తే అక్కడికి వచ్చిన వాళ్ళెవరైనా సినిమా చూస్తారు, భానూ? వాళ్ళంతా నీమీదినించి కళ్ళు పక్కకి తిప్పగలరా? నువ్వెంత అంద గత్తెవో కాస్త అయినా ఆలోచించవేమిటి? వాళ్ళందరికీ వారం రోజులు నిద్ర లేకుండా చెయ్యటానికా?.... అదంతా తీసివేసి జుట్టంతా చెరువుకుంటే సినిమాకు తీసుకుపోతాను.

"ఎంత విపరీతంగా మాట్లాడతారండీ!"

కొంతకాలం అయిన తరవాత.

"ఇవాళ నన్ను జానకీవాళ్ళు పేరంటానికి పిలిచారు. నేనుకూడా—"

"వెళ్ళకు!"

భాను ఇక మనస్సు బిగబట్టుకోలేక—

"నేను కాపరానికి వచ్చినప్పటినించీ చూస్తున్నాను, నన్నెందుకండీ ఈ నాలుగుగోడలమధ్యా పాతేశారు? అందరూ చక్కగా అన్నిచోట్లకూ పోతారు—"

అతను నవ్వాడు.

"నాకు నీ విషయమై ఎంత అసూయో నువ్వింకా గ్రహించలేదా? నాకు నీమీద ఎంత ప్రేమ ఉన్నదీ చూస్తూనే ఎందుకట్లా అడుగుతావు? నువ్వాడ వాళ్ళలో ఎంత అసామాన్యమైన మనిషివో నేను మగవాళ్ళలో అంత అసామా న్యుణ్ణి కాను. అసలు నేను చాలా మామూలు మనిషిని. నువ్వు వచ్చిన తరవాత నేను ఒక స్నేహితుణ్ణి ఇంటికి రానివ్వటం లేదు. వాళ్ళలో అనేకమంది ఉన్నారు, నిన్ను సులభంగా ఆకర్షించగలవాళ్ళు."

భాను నోట మాటరాలేదు.

ఒక సంవత్సరం గడిచింది.

ప్రమాదవశాన భాను రహస్యం అతని కళ్ళపడ్డది. భాను బజారులో వెళ్ళే ఎవరివంకనో చూస్తూ నవ్వింది— భర్త గమనిస్తున్నాడని తెలియక, మరు క్షణం అవతల మనిషి కూడా అతనికి కనపడ్డాడు.

ఆ మనిషికి ముప్ఫై ఏళ్ళుంటై. ముదురు మొహం. చింపిరి తల. రౌడీ వేషం.

ఆనాటి నించీ భానుకు స్వేచ్ఛ లభించింది. ఆమె చక్కగా అలంకరించు కుని ఆకర్షవంతంగా ముస్తాబు కాందీ అతను భానును ఎక్కడికీ వెంట తీసుకుని వెళ్ళేవాడు కాడు. కొంతకాలం గడిచింది.

అప్పుడే సినిమా నించి భానూ అతనూ తిరిగివచ్చారు.

అప్పటికి భాను మళ్ళా పూర్తిగా మారిపోయింది. ఆమె మళ్ళీ బర్తవంక నవ్వుతున్న కళ్ళతో చూడటం నేర్చుకున్నది. ఆ మధ్య తనలో కలిగిన మార్పు ఆమెకు తెలియదని అనుకోవాలి. ఎందుకంటే ఆమె ఇప్పుడు తన అలంకారం తీసివేస్తూ—

"ఏమండీ మీరు ఒకప్పుడు నా విషయం అనవసరంగా అసూయపడ్డారు, కాదూ?" అన్నది.

అతను నవ్వుతూ "ఎందుచేతా?" అన్నాడు.

"ఇన్ని సినిమాలు చూస్తున్నాను, ఇంతమంది మగవాళ్ళను చూస్తున్నాను. నా కళ్ళకు ఎవరూ మీరున్నట్టు ఉండరేం?"

అతను నవ్వాడు. ఏమి జవాబు చెప్పలేదు.

వట్టి స్వార్థపరుడు!

(మొదటి ముద్రణ : ఫిబ్రవరి 1937, కారుణ్యం కథల సంపుటి,
తెనాలి : యువ కార్యాలయ ప్రచురణ)